## క్లుప్తంగా

### ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని మండల యూపీ స్కూల్లో శనివారం 4, 5 తరగతుల విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారిలో పది మందిని ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకాలను చిత్తూరుకు చెందిన వ్యాపారవేత్త మనోహర్ సౌజన్యంతో అందజేశారు. ఏటా ఆయన విద్యార్థులకు బ్యాగులు, ప్యాడ్లు ఇస్తున్నారని హెచ్ఎం భానుమతి తెలిపారు.

### చేతుల శుభ్రతపై అవగాహన



బాలికోన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ అనూరాధ

బైరెడ్డిపల్లి: పరిసరాల శుభ్రతతో పాటు చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉంటేనే ఆరోగ్యవంతంగా ఉంటారని సీహెచ్ఓ అనూరాధ అన్నారు. శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎక్కువగా నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. రక్తహీనత సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన ఆహారం, పోషకాహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉన్నత శిఖరాలకు ఎదిగి మంచి పేరు తేవాలి



వార్షికోత్సవంలో టీచర్లు, విద్యార్థులు

కుప్పం రూరల్: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు, స్కూలుకు, గ్రామానికి మంచి పేరు తేవాలని గుండ్లమడుగు ఉపాధ్యాయుడు చందు ఆకాంక్షించారు. శనివారం గుండ్లమడుగు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం చందు మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఏకాగ్రత, క్రమశిక్షణతో దానిని సాధించాలన్నారు. ఉపాధ్యాయులు చిట్టిబాబు, జాన్సన్, వరలక్ష్మి, గీత, ప్రేమ, ప్రసన్న, దుర్గ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



కుప్పం: అగ్ని మాపక శాఖ వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. గ్యాస్ వల్ల జరిగే ప్రమాదాలను నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలోని గ్యాస్ గోడౌన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, గ్యాస్ ప్రమాదాలు సంభవిస్తే వాటి నివారణ చర్యలు, అలాగే వాటి నుంచి సురక్షితంగా బైట పడటంపై వారోత్సవాల్లో ప్రజలకు అవగాహన కల్పించినట్టు స్థానిక అగ్నిమాపక అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రెడ్డెన్న, నరేష్, కృష్ణయ్య, సత్య, లక్ష్మీనారాయణ.రామ్మూర్తి, రఘుపతి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

### కళ్యాణం..కమనీయం



సదుం: మండలంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం సీతారాముల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను విశేషంగా అలకరించి, భక్తజన సందడి నడుమ ఈ కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. ఉభయదారులుగా కే.నాగరాజు, విజయలక్ష్మి, జీ. నాగరాజు, వెంకటరమణ వ్యవహరించారు.

### వైఎస్సార్ సీపీ వార్డు మెంబర్ దంపతులపై దాడి

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ వార్డు మెంబర్, తన భర్త రమేష్ గౌడుతోపాటు తనపై టీడీపీ నేతలు దాడి చేశారంటూ రమేష్ భార్య కాంతమ్మ శనివారం రాత్రి రామకుప్పం పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసింది. పాత కక్షల నేపథ్యంలో తమపై గ్రామానికి చెందిన 9 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు కర్రలతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది.

# కుప్పానికి మోసం చేసిన చంద్రబాబు

- 60 శాతం బీసీలు ఉన్న నియోజకవర్గాన్ని ఆక్రమించిన బాబు
- చేసింది శూన్యం.. మళ్లీ మరో అవకాశం అంటున్న వైనం
- గుండ్లమడుగు, శివానందపురం ప్రచారంలో భరత్ విమర్శ
- పేద, బడుగుల అభ్యున్నతి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని స్పష్టీకరణ



ప్రజలకు అభివాదం చేస్తున్న భరత్

కుప్పం రూరల్: 35 ఏళ్లుగా కుప్పం ప్రజలకు చంద్రబాబు ఏమీ చేయకపోగా, మరో అవకాశం ఇవ్వాలని ఎన్నికల వేళ కుప్పం ఓటర్లను అభ్యర్థించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ మండిపడ్డారు. శనివారం మండలంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన గుండ్లమడుగు, శివానందపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. భరత్ మాట్లాడుతూ, 60 శాతం బీసీలు ఉన్న కుప్పం నియోజక వర్గాన్ని చంద్రగిరి నుంచి వలస వచ్చిన చంద్రబాబు ఆక్రమించి ఇన్నేళ్లలో చేసింది శూన్యమని విమర్శించారు. ఆయన నిజంగా అభివృద్ధి చేయాలని సంకల్పించి ఉంటే 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఎంతో చేసి ఉండవచ్చని, అయితే ఇక్కడ ప్రజల అమాయకత్వాన్ని చేసుకుని తన రాజకీయాలకు కుప్పాన్ని వాడుకున్నారని ఆరోపించారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలుగా ఉన్న గ్రామాలను అయితే పట్టించుకున్న పాపానపోలేదని, తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమ రవాణాలకు మాత్రమే ఈ ప్రాంతాలను ఎంచుకున్నారని, మారుమూల ప్రజలకు చేసింది శూన్యమని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పంకు కూడా ప్రాధాన్యత ఇచ్చారని, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నా వివక్షణ చూపకుండా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు 4 వేల ఇళ్లు మంజూరు చేశారన్నారు. ఇదే తెలుగు దేశం పాలనలో సంక్షేమ పథకాలన్ని జన్మభూమి కమిటీలు, పార్టీ వారికే దక్కేవని, తమ హయాంలో పేదరికమే ప్రామాణికంగా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నామని చెప్పారు. పేదలు, బడుగులకు పథకాలు అందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని కోరారు.

**అడుగడుగునా ఘనస్వాగతం**

తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారానికి మంచి స్పందన లభించింది. ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. రెండు గ్రామాల జనం భరత్ అడుగులో అడుగులు వేస్తూ, ఇంటింటి ప్రచారంలో మద్దతు పలికారు. తామంతా మీ వెంటే ఉంటామంటూ నినదించారు. ప్రచారంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, పార్టీ మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, నాయకులు శీను, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



భరత్‌కు హారతి ఇస్తున్న మహిళ

### మా ఆయన భరత్‌కు ఒక్క చాన్స్ ప్లీజ్!



ఎన్నికల ప్రచారం చేస్తున్న దుర్గ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్

కుప్పం: సార్వత్రిక ఎన్నికల్లో మా ఆయనకు ఎమ్మెల్యేగా ఒక్క చాన్స్ ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. శనివారం మున్సిపాలిటీలో 10 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ సుధీర్‌తో కలసి ప్రచారం చేశారు. కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. ఐదేళ్లుగా కుప్పంలోనే స్థిరనివాసం ఉంటూ, అందరికీ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను భరత్ పరిష్కరిస్తున్నారని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని జగనన్న హామీ ఇచ్చారని, దీనిని ప్రజలు సాకారం చేస్తే కుప్పం నియోజవకారగ్గిని మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే తమ కుటుంబం మూడవసారి చంద్రబాబుతో తలపడుతోందని, ఈ సారైనా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా జగనన్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఆయన్ను సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా రెడ్డెప్పను, ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపించాలని సుధీర్ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# మభ్య పెట్టేందుకే కూటమితో బాబు చెలిమి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- కూటమి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీ సాధనే లక్ష్యం
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపు

పెద్దపంజాణి: పేదల సంక్షేమమే పరమావధిగా పరిపాలన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ కోరారు. పలమనేరు సూపర్ బజార్ చైర్మన్ సుభాష్ చంద్రబోస్‌తో కలసి శనివారం మంలంలోని లింగాపురం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి చేస్తున్న అసత్య ఆరోపణలను, దుష్ప్రచారాన్ని పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికి చంద్రబాబునాయుడు జనసేన, బీజేపీతో చేతులు కలిపారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మండలం నుంచి గతం కంటే రికార్డు స్థాయి మెజార్టీతో గెలపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా రెడ్డెప్ప విజయానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీబాబు, ఆంజమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సలహాదారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, అగ్రికల్చర్ బోర్డు చైర్మన్ వెంకటరమణారెడ్డి, జిల్లా కార్యదర్శులు సుహేబ్, తమ్మిరెడ్డి, మూకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పథకాలే విజయానికి ప్రచారాస్త్రాలు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి పావనీగౌడ



ఫ్యాన్ గుర్తు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న పావనీగౌడ, పార్టీ నాయకులు

వి.కోట: ముఖ్యమంత్రి జగనన్న చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయానికి ప్రచారాస్త్రాలుగా ప్రజలు భావిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావనీగౌడ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎస్ బండపల్లె పంచాయతీలోని ఆరిమాకులపల్లె, బెల్లకుంట, పెదలుదొడ్డి, గంగేపల్లె, ఎస్ బండపల్లె, కొత్తకోట, రాగి సముద్రం, ఆకులదొడ్డి గ్రామాల్లో ఆమె జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. తన భర్తను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధిని చేసి చూపించడమే కాక, దేశానికే ఆదర్శవంతమైన పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యావ్యవస్థలో మార్పులు తేవడంతో పాటు ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గతంలో గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉండేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేశారని చెప్పారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తన భర్తతోపాటు ఎంపీగా రెడ్డెప్పను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, నాయకులు శాలిని, భూపతి, ప్రతాప్‌రెడ్డి, ఉదయ్,లతీఫ్, సుబ్బు, క్రిష్ణ, సుధాకర్‌రెడ్డి, పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరత్ గెలుపు కోసం కృషి చేయండి



రామకుప్పం: ఓట్లు అభ్యర్థిస్తున్న సింగం సుధారాణి

శాంతిపురం: తన కుమారుడి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తల్లి పద్మజ కోరారు. శనివారం కడపల్లెలో ఆమె కార్యకర్తలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ కలిగిన మేలును ఓటర్లకు వివరించాలని కోరారు. తన పాలనలో మేలు జరిగి ఉంటేనే పార్టీకి ఓటు వేయాలని సీఎం పదే పదే కోరుతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అంత ధైర్యంగా జనానికి పిలుపునిచ్చిన నాయకుడు దేశ చరిత్రలో ఎవరూ లేరని చెప్పారు. కుప్పం ప్రాంత అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం తన భర్త, దివంగత చంద్రమౌళి తపించారన్నారు. ఆయన చివరి కోరిక మేరకు, తన ఆశయాల సాధన కోసం విదేశాల్లో చేస్తున్న ఉద్యోగం వదులుకుని భరత్ ఇక్కడికి వచ్చారని స్పష్టం చేశారు. కుప్పంలో భరత్‌ను గెలిపించి సీఎంకు కానుకగా ఇవ్వడమే చంద్రమౌళికి నిజమైన నివాళిగా ఆమె పేర్కొన్నారు.

**నివాళి**

కడపల్లెలో మృతి చెందిన కాలియమ్మ(69) మృత దేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పద్మమ్మ ఓదార్చారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు మురుగేష్, కృష్ణ, సంపంగి, రాజు తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పంలో..**

రామకుప్పం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు సింగం సుధారాణి కోరారు. శనివారం మండలంలోని పేరూరు, కృష్ణమనాయనపల్లెలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పించారని, మరోమారు వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడానికి, వైఎస్సార్ సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పకు ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### భక్తిప్రపత్తులతో బాలాలయ ఉత్సవాలు



గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో శ్రీ ఆది వరాహ స్వామి బాలాలయ అష్టబంధన మహా సంప్రోక్షణ ఉత్సవాలు కంకణంభట్టార్ ఏకే. నరసింహాచార్యులు అర్చక బృందం పర్యవేక్షణలో వైఖానసాగమోక్తంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో మూడవ రోజు శనివారం శ్రీ భూ సమేత వరాహస్వామికి ఉదయం పంచకవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, విశ్వక్సేన, పుణ్యాహవచనం, విశేష హోమాలు, అగ్నిప్రతిష్ట, కుంభారాధన, అదివాసత్రయం, అతివాస అంగ హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి బింబస్య దివ్యతేజ మహాశాంతి అభిషేకం, రాత్రికి శయ్యాధివాసం, పూర్ణాహుతి నిర్వహించారు. చివరిరోజైన ఆదివారం యాగశాలలో స్వామివారికి పూర్ణాహుతి, మీన లగ్నంలో స్వామివారి ప్రాణప్రతిష్ఠ తరువాత సర్వదర్శనం ఉంటుందని అర్చకులు తెలిపారు. ఉత్సవాల్లో ఆలయ సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, హర్ష దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగుల పరుగు

రొంపిచెర్ల: సాధారణ ఎన్నికలలో ఓటు వేసేందుకు మండలంలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం పరుగులు తీస్తున్నారు. ఈ నెల 22వ తేదీ లోపు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు ఏ నియోజక వర్గంలో ఓటు ఉందో అదే నియోజక వర్గ కేంద్రంలోని ఆర్‌వోకు 22వ తేదీ లోపు దరఖాస్తులను సమర్పించాల్సి ఉందని అధికారులు తెలిపారు. అయితే పక్కనే ఉన్న తిరుపతి జిల్లాలో నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు తీసుకుంటున్నారు. అయితే చిత్తూరు జిల్లాలో మాత్రం నియోజక వర్గంలోని ఆర్‌ఓ కార్యాలయంలో ఇవ్వాలని చెబుతున్నారని, దీని వలన సెలవు పెట్టి వెళ్లాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటి వరకు కనీసం 15 శాతం మంది ఉద్యోగులు కూడా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదని సమాచారం. దరఖాస్తు చేసుకున్న వారు వచ్చే నెల 5 నుంచి 10వ తేదీ వరకు వరకు నియోజక వర్గంలోని ఆర్‌ఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని చెబుతుండడంతో రెండు రోజులు సెలవు పెట్టాల్సి వస్తుందని హెల్త్ డిపార్ట్‌మెంట్, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు వాపోతున్నారు. నియోజక వర్గంలోని ప్రతి తహసీల్దార్ కార్యాలయంలోను పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

**ఆర్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు**

ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం పుంగనూరు నియోజక వర్గ ఆర్‌ఓ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలి. 5వ తేదీ పైన అక్కడే బ్యాలెట్ సమర్పించాలి. మా కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. –మోహీద్దీన్, తహసీల్దార్

# వారిద్దరి పాలన అధ్వానం

- కిరణ్‌కుమార్, చంద్రబాబుపై మంత్రి పెద్దిరెడ్డి సోదరుడి మండిపాటు
- ఆస్తులు పెంచుకోవడానికే బీజేపీలో కిరణ్ చేరిక
- మిథున్‌రెడ్డిపై చిత్తుగా ఓడిపోవడం తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: ఉమ్మడి జిల్లాకు చెందిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా తమ హయాంలో పరిపాలన అధ్వానంగా చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆరోపించారు. శనివారం సదుంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డిపై కిరణ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అప్పట్లో డీసీసీ అధ్యక్షుని నియామకానికి కిరణ్‌ను సంప్రదించాల్సిన అవసరం మంత్రికి లేదన్నారు. తమకు వారికి ఎప్పటి నుంచో విభేదాలు ఉన్నాయని, అలాంటప్పుడు ఎలా సంప్రదిస్తారని ప్రశ్నించారు. సీఎం కావాలని అనుకుంటే కాంగ్రెస్ హయాంలోనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయ్యేవారని, కానీ అప్పటి కాంగ్రెస్ పెద్దల మాటలకు విలువ ఇచ్చి ఆ పదవి వైపు మొగ్గు చూపలేదన్నారు. అప్పట్లోనే ఎవరు సీఎంలుగా ఉంటే వారి పంచన చేరి చాడీలు చెప్పి పబ్బం గడుపుకునే నైజం కిరణ్‌ది అని, అలానే ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీ, చిదంబరం కాళ్లు పట్టుకుని సీఎం అయ్యారని ఆరోపించారు. తమ అన్న గతంలోనూ పలువురు సీఎంలతో విభేదించారని, పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో డీసీసీ సభ్యులతో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి డీసీసీ అధ్యక్షుడిగా గెలిచారని అన్నారు. సీఎంగా కిరణ్ ఉన్న సమయంలో సత్యసాయిబాబా చనిపోతే వారం రోజులు ఎవరికీ ఎందుకు చెప్పలేదో, అక్కడ ఉన్న వేల కోట్ల రూపాయలు, బంగారం తరలించారని పలువురు అప్పట్లో చెప్పే వారని, దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆస్తులు కాపాడుకోవడానికి, పెంచుకోవడానికే ఆయన బీజేపీలో చేరారని, అతనిపై భారీ మెజార్టీతో మిథున్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించడం తథ్యమని స్పష్టం చేశారు. ఎన్నికలలో ఓడి అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారని చెప్పారు. తమ సోదరునిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, బోయకొండ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు ఖాజాపీర్, ఇమ్రాన్, వెంకటస్వామి, ఉషారాణి, ఎల్లారెడ్డి, శివారెడ్డి, పుత్రాజు, ఎల్లారెడ్డి, మనోహర్‌రెడ్డి, మహేష్, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీకే మైనారిటీల మద్దతు



ఎన్నికల ప్రచారం చేస్తున్న మైనారిటీ నేతలు

రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలోని మైనారిటీలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు, మండల కో– ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా పేర్కొన్నారు. మండలంలోని గెర్నిపల్లె, లింగాపురం, 89 పెద్దూరు, బల్ల గ్రామాల్లో శనివారం స్థానిక మైనారిటీలతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాల్లో ప్రతి మైనారిటీ గడపకూ వెళ్లి పలకరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనారిటీల సంక్షేమం, అభ్యున్నతికి చేసిన కృషిని వివరించారు. సీఎం వైఎస్ జగన్ మైనారిటీలను అన్ని విధాలా ఆదుకున్నారన్నారు. నూతన మసీదులు, షాదీమహల్ నిర్మాణాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలా సహకరించిందన్నారు. అలాగే టీడీపీ కూటమికి మైనారిటీలు ఓట్లు వేస్తే కలిగే నష్టాన్ని వివరించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి,ఎమ్మెల్సీ భరత్, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పకు మైనారిటీలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ నేతలు జబీవుల్లా, నయాజ్, ఏజస్, షౌకత్, అక్తర్, రషీద్, ఘని,షేకా, లతీఫ్, అల్లాబక్షు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు చూసి ఓట్లు వేయాలని పలువురు నాయకులు ఓటర్లను కోరారు. శనివారం పట్టణంలో నాగపాళ్యెం, ఎంబీటీ రోడ్డు ప్రాంతాలలో పీఆర్ఆర్ వారియర్స్ డాక్టర్ శివ, డాక్టర్ శరణ్, త్రిమూర్తిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, పిఎల్.శ్రీధర్, కృష్ణప్ప, శ్రీనివాసులు, నానబాలగణేష్, రెడ్డెప్ప, ఆర్‌కె.రామకృష్ణ, బిటి.అతావుల్లా , నానబాలవీధిలో కౌన్సిలర్ నయీంతాజ్ , మైనారిటీ నాయకుడు ఇంతియాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. మసీదు ముతవల్లి అజీజ్‌సాహెబ్‌ను కలసి మైనారిటీల ఓట్లు వైఎస్సార్‌సీపీకి వేయించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారాలలో రషీదబేగం, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డి, తుంగా చంద్రశేఖర్, భాస్కర్‌జెట్టి, రఘునాథరెడ్డి, సునిల్, తీర్థా నందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పాకెం పంచాయతీలో..**

పులిచెర్ల(కల్లూరు): రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మురళీధర్ కోరారు. శనివారం మండలంలోని పాకెం పంచాయతీలో ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ పుంగనూరు శాసనసభ్యులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా జగన్ రావాలన్నారు. అలాగే రాయవారిపల్లె పంచాయతీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరపున విరూపాక్షి జయచంద్రారెడ్డి ప్రచారం చేశారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాదముని రెడ్డి, మునస్వామి, మునీశ్వర, వినాయక, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాయవారిపల్లె పంచాయతీలో ప్రచారం చేస్తున్న విరూపాక్షి జయచంద్రారెడ్డి

**జోరుగా ఎన్నికల ప్రచారం**

సదుం: మండలంలోని బూరగమంద, చెరుకువారిపల్లె పంచాయతీలలో మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఐశ్వర్య, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లె మండలంలో..**

బైరెడ్డిపల్లె: పలమనేరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడను మరోసారి ఎమ్మెల్యేగా, ఎంపీ ఎన్.రెడ్డెప్పను ఎంపీగా గెలిపించాలని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి కోరారు. మండలంలోని ధర్మపురి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో కల్లబొల్లి హామీలతో మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, ఆయన మాటలను ఎవరూ నమ్మరాదన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు బాలక్రిష్ణగౌడు, వెంకటేష్, ఎంపీటీసీ నాగరాజ, వినాయకం, వైఎస్సార్‌సీపీ నేతలు కేశవులు, జయకుమార్‌రెడ్డి, తబ్రాజ్‌బాషా, ఫైజుల్లా, శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో ప్రచారం చేస్తున్న శివ, శరణ్, త్రిమూర్తి



ముతవల్లి అజీజ్‌సాహెబ్‌కు కరపత్రాలు ఇస్తున్న నేతలు



సదుం: ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి ఇందిరమ్మ



సదుం: ప్రచారం చేస్తున్న సోమశేఖర్‌రెడ్డి



పులిచెర్ల: పాకెంలో కరపత్ర ప్రచారం చేస్తున్న నాయకులు



బైరెడ్డిపల్లె: ధర్మపురిలో ప్రచారం చేస్తున్న బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి